కళ్లజోడు తీస్తే నీలాంటివాడ్నే..

ఎట్టకేలకు అభిమానుల నిరీక్షణకు బ్రేక్ పండింది. రామ్‌చరణ్ 'గేమ్ చేంజర్' నుంచి రెండో పాటను మేకర్స్ విడుదల చేశారు. 'కళ్లజోడు తీస్తే నాలాంటి వాడ్నే.. షర్ట్ పైకి పెడితే నీలాంటివాడ్నే..' అంటూ సాగే ఈ పాటను అనంతశ్రీ రామ్ రాయగా, తమన్ స్వరపరిచారు. నకాష్ అజీజ్ ఆలపించారు. ఈ పాటను హిందీ, తమిళ వెర్షన్లను కూడా విడుదల చేశారు. దర్శకుడు శంకర్ తనదైన మార్క్ చూపిస్తూ గ్రాండియర్‌గా ఈ పాటను తెరకెక్కించారని, రామ్‌చరణ్ ఎనర్జిటిక్‌గా, స్టైలిష్ లుక్‌తో ఈ పాటలో అలరించారని నిర్మాత దిల్‌రాజు తెలిపారు. 'వెయ్యిమంది జానపద కళాకారులతో కలిసి రామ్‌చరణ్ చేసిన డాన్స్ ఈ పాటకు హైలైట్‌గా నిలుస్తుంది. వివిధ రాష్ట్రాలకు చెందిన జానపద కళాకారులు ఈ పాటలో భాగం అవ్వడం విశేషం. తెలుగు రాష్ట్రాలకు చెందిన గుసాడి, కొమ్ము కోయ, తప్పెటగుళ్లు వంటి జానపద రీతులతోపాటు వెస్ట్ బెంగాల్‌కు చెందిన చౌ, ఒరిస్సాకు చెందిన గుమ్రా, రానప్ప, పైకా, దురువ, కర్ణాటకకు చెందిన హలారి, ఒక్కలిగ, గొరవర, కుణిత వంటి నృత్య రీతుల్ని ఈ పాటలో శంకర్ భాగం చేశారు. తమన్ సంగీతం, గణేశ్ ఆచార్య కొరియోగ్రఫీ, రామ్‌చరణ్ స్టెప్పులు థియేటర్లలో జాతరను తలపిస్తాయ్' అని మేకర్స్ తెలిపారు. కియారా అద్వానీ, అంజలి కథానాయికలుగా నటిస్తున్న ఈ చిత్రంలో శ్రీకాంత్, ఎస్.జె.సూర్య సముద్రఖని కీలక పాత్రలు పోషిస్తున్నారు.

భవభూతి బాధ్యత

శ్రీవిష్ణు కథానాయకుడిగా రూపొందిన యునిక్ ఎంటర్టైనర్ 'స్వాగ్'. 'రాజ రాజ చోర' ఫేం హసిత్ గోలి దర్శకుడు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్ నిర్మించిన చిత్రం ఈ నెల 4న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమా థియేట్రికల్ ట్రైలర్‌ని మేకర్స్ విడుదల చేశారు. '1551 నుంచి మగవాడి ప్రయాణం' అంటూ ట్రైలర్ మొదలైంది. ఈ రాజవంశానికి చెందిన ఏకైక వారసుడైన సింగాకు రాజవంశం తాలూకు నిధిని అప్పగించడం అదే వంశానికి చెందిన భవభూతి బాధ్యతగా భావిస్తాడు. అయితే.. వింధ్యామర రాణి దీన్ని అడ్డుకోవడానికి ప్రయత్నిస్తుంది. ఈ నేపథ్యంలో కథ సాగుతుందని ట్రైలర్ చెబుతున్నది. జెండర్ గేమ్స్‌ని ట్రైలర్‌లో ఆసక్తిగా దర్శకుడు ప్రజెంట్ చేశారు. శ్రీవిష్ణు నాలుగు గెటప్పుల్లో కనిపించారు. ఆయన బాడీలాంగ్వేజ్, డైలాగ్ డిక్షన్, అన్నీ వైవిధ్యంగా ఉంటాయని మేకర్స్ చెబుతున్నారు. రీతూ వర్మ, మీరా జాస్మిన్ కథానాయికలుగా నటించిన ఈ చిత్రానికి కెమెరా: వేదరామన్ శంకరన్, సంగీతం: వివేక్‌సాగర్, సహనిర్మాత: వివేక్ కూచిభొట్ల.

డిస్కో డ్యాన్సర్‌ను వరించిన దాదా సాహెబ్ ఫాల్కే

'ఐయామ్ ఏ డిస్కో డ్యాన్సర్..' అంటూ తనదైన సిగ్నేచర్ నృత్యంతో ఎనభై దశకంలో యువతరాన్ని ఉర్రూతలూగించిన విలక్షణ నటుడు మిథున్ చక్రవర్తికి సోమవారం కేంద్ర ప్రభుత్వం భారతీయ సినీరంగంలో అత్యున్నత పురస్కారమైన దాదా సాహెబ్ ఫాల్కేను ప్రకటించింది. కేంద్ర సమాచార, ప్రసార శాఖా మంత్రి అశ్విన్ వైష్ణవ్ ఈ విషయాన్ని ఎక్స్ (ట్విట్టర్) వేదికగా తెలియజేశారు. ఆశాపరేఖ్, ఖుష్బూ సుందర్, విపుల్ అమృత్‌షాలతో కూడిన జ్యూరీ మిథున్ చక్రవర్తిని ప్రతిష్ఠాత్మక దాదా సాహెబ్ ఫాల్కే పురస్కారానికి ఎంపిక చేశారు. 'డిస్కో డ్యాన్సర్'గా నాటి ప్రేక్షకులకు సుపరిచితుడైన మిథున్ చక్రవర్తి చిత్రపరిశ్రమలో బెంగాల్ టైగర్ అనే గుర్తింపును పొందారు. మూడుసార్లు జాతీయ అవార్డులు అందుకొని రికార్డు సృష్టించారు.

◆ ఉద్యమాల నుంచి హీరోగా ప్రస్థానం

మిథున్ చక్రవర్తి అసలు పేరు గౌరంగా చక్రవర్తి. బసంత కుమార్ చక్రవర్తి, శాంతి రాణి దంపతులకు 1950 జూన్ 16న కోల్‌కతాలో జన్మించారు. బిఎస్సీ కెమిస్ట్రీతో పాటు పూనే ఫిల్మ్ అండ్ టెలివిజన్ ఇనిస్టిట్యూట్ నుంచి డిగ్రీలు పొందారు. అనంతరం భుస్వామ్య, పెత్తందారి వ్యవస్థకు వ్యతిరేకంగా ఆనాడు జరిగిన నక్సల్ ఉద్యమంలో కీలక భూమిక పోషించారు. అయితే సోదరుడి అకాల మరణంతో కలత చెందిన ఆయన కోల్‌కతాను వదిలి బతుకుతెరువు కోసం ముంబయిలో అడుగుపెట్టారు. తొలుత చిన్న ఉద్యోగాలు చేస్తూ ఓ నైట్‌క్లబ్‌లో డ్యాన్సర్‌గా చేరారు. అక్కడే అతని జీవితం మలుపు తిరిగింది. నృత్యంలో అతని ప్రతిభను చూసి అక్కడకొచ్చిన సినీ ప్రముఖులు మెచ్చుకునేవారు. దాంతో సినీరంగంలో అదృష్టాన్ని పరీక్షించుకోవాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో నటనలో శిక్షణ కూడా తీసుకున్నారు

◆ 'మృగయా' చిత్రంతో సినీరంగ ప్రవేశం

మృణాల్‌సేన్ దర్శకత్వంలో రూపొందిన 'మృగయా' (1978) చిత్రం ద్వారా మిథున్ సినీ రంగ ప్రవేశం చేశారు. అద్భుత నటనకుగాను తొలి చిత్రంతోనే జాతీయ ఉత్తమ నటుడిగా అవార్డును గెలుచుకున్నారు. అదే ఏడాది 'నది తేరే సాగరే' సినిమా ద్వారా బెంగాలీ ఇండస్ట్రీలో అడుగుపెట్టారు. ఆ సినిమా కూడా పెద్ద విజయాన్ని సాధించింది. అనంతరం సురక్ష, షౌకిన్, అశాంతి, డిస్కో డ్యాన్సర్, డ్యాన్స్ డ్యాన్స్, ఘర్ ఏక్ మందిర్, గురు, తరానా, వర్ధత్, బాక్సర్, అగ్నిపథ్, జల్లాద్, కమాండో, ప్యార్ ఝుక్తా నహీ వంటి చిత్రాలతో స్టార్‌డమ్‌ను సొంతం చేసుకున్నారు. మృగయా, తహదీర్ కథా చిత్రాలకు ఉత్తమ నటుడిగా, స్వామి వివేకానంద (1998) చిత్రానికిగాను ఉత్తమ సహాయ నటుడిగా జాతీయ అవార్డులను సొంతం చేసుకున్నారు. 80, 90 దశకాల్లో అగ్ర హీరోల్లో ఒకరిగా మిథున్ చక్రవర్తి పేరుప్రఖ్యాతులు సంపాదించుకున్నారు. హిందీ, బెంగాలీ, భోజ్‌పురి, పంజాబీ, తెలుగు, కన్నడ, ఒరియా భాషల్లో 350కిపైగా చిత్రాల్లో నటించారు. తెలుగులో గోపాల గోపాల, మలుపు చిత్రాల్లో నటించారు. బుల్లితెరపై ప్రయోక్తగా కూడా మంచి గుర్తింపు తెచ్చుకున్నారు మిథున్ చక్రవర్తి.

◆ 'డిస్కో డ్యాన్సర్'తో యువతలో క్రేజ్

1982లో విడుదలైన 'డిస్కో డ్యాన్సర్' చిత్రం మిథున్ చక్రవర్తికి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తెచ్చిపెట్టింది. 'ఐయామ్ ఏ డిస్కో డ్యాన్సర్' పాట నాటి యువతను ఉర్రూతలూగించింది. ఈ పాట అంతర్జాతీయంగా మిథున్ చక్రవర్తికి పాపులారిటీ తీసుకొచ్చింది. ఆ రోజుల్లోనే సిక్స్‌ప్యాక్‌తో కూడిన దేహదారుడ్యంతో పాటు బ్రేక్ డ్యాన్సులు, అద్భుతమైన ఫైట్లతో యాక్షన్ హీరోగా తిరుగులేని క్రేజ్ సంపాదించుకున్నారు. 1989లో ఒకే ఏడాదిలో అత్యధికంగా 19 సినిమాలు చేసి లిమ్కా బుక్ ఆఫ్ రికార్డుల్లో చోటు సంపాదించుకున్నారు. భారతీయ సినీ చరిత్రలో తొలిసారి వందకోట్లు వసూలు చేసిన చిత్రంగా 'డిస్కో డ్యాన్సర్' చరిత్ర సృష్టించింది.

◆ రాజకీయరంగ ప్రవేశం

నటనతో పాటు సినీ నిర్మాణం, హోటల్ వ్యాపారంలో మిథున్ చక్రవర్తి రాణించారు. 80, 90 దశకాల్లో అగ్రశ్రేణి వ్యాపార సంస్థలకు ప్రచారకర్తగా వ్యవహరించారు. అనంతరం తృణమూల్ కాంగ్రెస్‌లో చేరిన ఆయన 2014లో రాజ్యసభ సభ్యుడిగా పనిచేశారు. 2021లో బీజేపీలో చేరారు. అక్టోబర్ 8న జరిగే 70వ జాతీయ చలన చిత్ర అవార్డుల ప్రదానోత్సవంలో మిథున్ చక్రవర్తి దాదా సాహెబ్ ఫాల్కే పురస్కారాన్ని అందుకోనున్నారు.

మూడ్రోజుల్లో 304 కోట్లు

సెప్టెంబర్ 27న ఎన్టీఆర్ 'దేవర 1' చిత్రం ప్రపంచవ్యాప్తంగా విడుదలైన విషయం తెలిసిందే. కొరటాల శివ దర్శకత్వంలో మిక్కిలినేని సుధాకర్, హరి కృష్ణ.కె, నందమూరి కల్యాణ్‌రామ్ నిర్మించిన ఈ చిత్రం తొలి రోజున 172 కోట్ల వసూళ్లను రాబట్టిందని, అదే స్పీడును కొనసాగిస్తూ ఈ వారాంతం ముగిసే వరకూ.. అంటే మూడు రోజుల్లోనే 304కోట్ల గ్రాస్ కలెక్షన్లను సాధించిందని నిర్మాతలు తెలిపారు. 'ఇప్పటికే 80శాతం రికవరీ అయ్యింది, తెలుగు రాష్ట్రాల్లో 87.69 కోట్ల షేర్ సాధించిన ఈ సినిమా హిందీలోనూ మంచి వసూళ్లను రాబడుతున్నది. సముద్ర నేపథ్యంలో భయం లేని వారియర్స్ చుట్టూ అల్లిన ఈ కథ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటున్నది. ఎన్టీఆర్ వన్‌మ్యాన్ షోగా 'దేవర'ను అభివర్ణిస్తున్నారు. అనిరుధ్ సంగీతం, రత్నవేలు ఛాయాగ్రహణం సినిమాను మరోస్థాయిలో నిలబెట్టాయి. జాన్వీకపూర్, సైఫ్ అలీఖాన్, ప్రకాశ్‌రాజ్, శ్రీకాంత్, షైన్ టామ్ చాకో నటించిన ఈ చిత్రం మరిన్ని రికార్డులతో దూసుకుపోవడం ఖాయం.' అని నిర్మాతలు నమ్మకం వ్యక్తం చేస్తున్నారు.

తండేల్ శివరాత్రి సంబరం

శ్రీకాకుళం జిల్లా డి.మత్యలేశం గ్రామంలో జరిగిన యథార్థ సంఘటనల ఆధారంగా రూపొందుతోన్న ప్రతిష్ఠాత్మక చిత్రం 'తండేల్'. నాగచైతన్య, సాయిపల్లవి జంటగా నటిస్తున్న ఈ మోస్ట్ అవైటెడ్ పాన్ ఇండియా మూవీకి చందూ మొండేటి దర్శకుడు. గీతా ఆర్ట్స్ పతాకంపై బన్నీ వాస్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. శ్రీకాకుళంలో దక్షిణకాశీగా పేరు గాంచిన శైవక్షేత్రం శ్రీముఖలింగం. అక్కడ వైభవంగా జరిగే శివరాత్రి మహోత్సవాలను స్ఫూర్తిగా తీసుకొని అద్భుతమైన శివరాత్రి పాటను ఈ సినిమా కోసం చిత్రీకరించారు. దేవిశ్రీప్రసాద్ టైమ్‌లెస్ క్లాసిక్‌గా ఈ పాటను కంపోజ్ చేశారని, శేఖర్ మాస్టర్ కొరియోగ్రఫీలో వేలాదిమంది డ్యాన్సర్స్‌తో కలిసి నాగచైతన్య, సాయిపల్లవి ఈ పాటకోసం చేసిన డ్యాన్స్ కొన్నేళ్లపాటు గుర్తుండిపోతుందని మేకర్స్ చెబుతున్నారు. ఈ సందర్భంగా ఈ సాంగ్ షూట్ నుంచి రెండు పోస్టర్లను మేకర్స్ విడుదల చేశారు. నాగచైతన్య, సాయిపల్లవి సంప్రదాయ దుస్తులతో ఈ పోస్టర్లో కనిపించారు. పాన్ ఇండియా స్థాయిలో విడుదల కానున్న ఈ చిత్రానికి కెమెరా: షామ్‌దత్, సమర్పణ: అల్లు అరవింద్.

అలా అయితే ఐటమ్‌సాంగ్‌కి రెడీ..

ఒకప్పుడు ఐటెమ్ సాంగ్స్ అంటే.. వాటికోసం ప్రత్యేకంగా నర్తకీమణులుండేవారు. జయమాలిని, సిల్క్‌స్మిత, అనూరాధ.. ఇలా అనమాట. ఇప్పుడు ఆ బాధ్యతను కూడా స్టార్ హీరోయిన్లే మోసేస్తున్నారు. ఒక సినిమాలో హీరోయిన్‌గా చేస్తే ఎంత పారితోషికం ముడుతుందో.. ఒక్క పాటకు అంత పారితోషికం ఇస్తామంటే ఎవరు కాదంటారు చెప్పండి? ఐశ్వర్యరాయ్ దగ్గర్నుంచి శ్రియ, సమంత, కాజల్, తమన్నా రీసెంట్‌గా త్రిష.. ఇలా చాలామంది స్టార్ హీరోయిన్లు ఐటమ్ సాంగ్స్‌లో మెరిసిన వారే. ఇప్పుడు ఈ లిస్ట్‌లో చేరడానికి బాలీవుడ్ భామ అనన్య పాండే కూడా సుముఖత వ్యక్తం చేస్తున్నది. ఇటీవల ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ 'ఐటమ్ సాంగ్స్‌లో చేయడానికి నాకెలాంటి అభ్యంతరం లేదు. కాకపోతే కథకు సంబంధం లేకుండా, కథ డిమాండ్ చేయకపోయినా కొందరు అనవసరంగా ఐటమ్ సాంగ్స్ పెడుతుంటారు. అలాంటి పాటల్లో నర్తించను, నటించను. నేను ఐటమ్ సాంగ్ చేస్తే అది కథలో ఉండాలి. కథ ఆ పాటను డిమాండ్ చేయాలి. అలాంటి పాట వస్తే తప్పకుండా ఐటమ్ సాంగ్ చేస్తా' అని తెలిపింది అనన్య పాండే.

అడవికే పాఠాలు నేర్పే గురువులు

మంచు విష్ణు టైటిల్ రోల్‌లో నటిస్తున్న చిత్రం 'కన్నప్ప'. ముఖేష్ కుమార్ సింగ్ దర్శకుడు. డిసెంబర్‌లో ప్రేక్షకుల ముందుకురానుంది. మహాశివభక్తుడు కన్నప్ప జీవిత కథ ఆధారంగా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమాలో మోహన్‌లాల్, శరత్‌కుమార్, అక్షయ్‌కుమార్, మోహన్‌బాబు, ప్రభాస్ వంటి అగ్రతారలు భాగమయ్యారు. ఈ సినిమాలో ప్రముఖ హాస్య నటుడు బ్రహ్మానందం, సప్తగిరి కీలక పాత్రల్లో నటిస్తున్నారు. సోమవారం వారి పాత్రల తాలూకు లుక్స్ విడుదల చేశారు. ఇందులో బ్రహ్మానందం పిలక పాత్రలో, సప్తగిరి గిలక పాత్రలో కనిపించనున్నారు. 'చేపకు ఈత, పులికి వేట, కోకిలకు పాట నేర్పిన గురువులు అడవికే పాఠాలు చెప్పడానికి వస్తే..' అంటూ వీరిద్దరి పాత్రలను పరిచయం చేశారు. వీరిద్దరి కామెడీ సినిమాకు ప్రధానాకర్షణగా నిలుస్తుందని చిత్ర బృందం పేర్కొంది. అవా ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై మోహన్‌బాబు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

పెళ్లి నాకిష్టంలేదు

సినిమా పేరు 'ఐ హేట్ మ్యారేజ్'. సుగి విజయ్, జుప్సీ భద్ర జంటగా నటిస్తున్నారు. పరమేశ్ రేణుకుంట్ల దర్శకుడు. ఎం.దయానంద్ నిర్మాత. ఈ చిత్రం షూటింగ్ సోమవారం హైదరాబాద్‌లో మొదలైంది. ముహూర్తపు సన్నివేశానికి నిర్మాత శ్రీనివాసరాజు క్లాప్ ఇవ్వగా, అగ్ర దర్శకుడు సుకుమార్ అన్నయ్య, రచయిత, నిర్మాత విజయ్‌కుమార్ కెమెరా స్విచాన్ చేశారు. చిత్ర సంగీత దర్శకుడు వరికుప్పల యాదగిరి గౌరవ దర్శకత్వం వహించారు. భావోద్వేగాలతో కూడిన యూత్‌ఫుల్ రొమాంటిక్ ఎంటర్టైనర్ ఇదని దర్శకుడు చెప్పారు. నేటి నుంచి ఏకధాటిగా డిసెంబర్ వరకూ జరిగే షెడ్యూల్‌తో చిత్రీకరణ పూర్తవుతుందని, కాన్సెప్ట్‌ని నమ్మి చేస్తున్న సినిమా ఇదని నిర్మాత తెలిపారు. పృథ్వీ, ఆశ్రిత, లోహిత్ ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: విజయ్ సి.కుమార్.

దిష్టి తగులుతుందని చెప్పలేదు

గత ఏడాది జూన్‌లో తన ప్రియుడు జహీర్ ఇక్బాల్‌ని పెళ్లాడి వైవాహిక జీవితంలోకి అడుగుపెట్టింది బాలీవుడ్ అందాలభామ సోనాక్షి సిన్హా. తన తాజా ఇంటర్వ్యూలో తన ప్రేమ, పెళ్లి, వైవాహిక జీవితం గురించి ఆసక్తికరంగా మాట్లాడింది సోనాక్షి. 'పెళ్లికి ముందు ఏడేండ్లు మేం డేటింగ్‌లో ఉన్నాం. కానీ ప్రపంచానికి తెలీదు. మా బంధం మా వ్యక్తిగతం. ప్రపంచానికి తెలియజేయాల్సిన అవసరం లేదని భావించాం. చెబితే ఏదిపడితే అది రాసేస్తారు. పైగా దిష్టి తగిలే అవకాశం ఉంది. అందుకే చెప్పలేదు. ఏడేండ్ల తర్వాత ఇద్దరం కలిసి పెళ్లి నిర్ణయం తీసుకున్నాం. పెళ్లి జీవితంలో మరపురాని ఘట్టం. అందుకే గుర్తుండిపోయేలా చేసుకోవాలనుకున్నాం. ముందు పెద్దల అంగీకారం తీసుకున్నాం. ఆత్మీయులు, మమ్మల్ని ప్రేమించేవాళ్ల సమక్షంలో సింపుల్‌గా సెలబ్రేట్ చేశాం. మా పెళ్లిలో హాజరైన అందరూ మమ్మల్ని ప్రేమించేవారే కావడం విశేషం. వారందరి దీవెనల వల్లే ఇప్పుడు భార్యాభర్తలుగా ప్రతి క్షణాన్నీ ఎంజాయ్ చేస్తున్నాం' అంటూ చెప్పుకొచ్చింది సోనాక్షి.

మైలురాయిలాంటి సినిమా

దర్శకుడు ఈశ్వర్ కార్తీక్ ఈ కథని జంగిల్, రాబిట్, లయన్.. అంటూ చెప్పడం మొదలుపెట్టాడు. జంగిల్ బుక్ తీస్తున్నాడేమో నా వాయిస్ కోసం వచ్చాడని అనుకున్నా. తర్వాత అసలు కథ చెప్పాడు. స్టోరీ అదిరిపోయింది. ఇంత అద్భుతమైన కథ ఇచ్చిన ఈశ్వర్‌కి థ్యాంక్స్. చాలా క్లారిటీగా స్క్రిప్ట్ రాసుకున్నాడు. ఇందులో చాలా కొత్తగా కనిపిస్తా. నా కెరీర్‌కి ఇది మైలురాయిలా నిలిచే సినిమా.' అని హీరో సత్యదేవ్ నమ్మకం వెలిబుచ్చారు. సత్యదేవ్, కన్నడ నటుడు డాలీ ధనుంజయ్ లీడ్ రోల్స్ చేసిన సినిమా 'జీబ్రా'. ఈశ్వర్ కార్తీక్ దర్శకుడు. ఎస్.రెడ్డి, ఎస్.పద్మజ, బాలసుందరం, దినేష్ సుందరం నిర్మాతలు. అక్టోబర్ 31న సినిమా విడుదల కానుంది. సోమవారం హీరో నాని ఈ సినిమా టీజర్‌ని ఆన్‌లైన్‌లో లాంచ్ చేశారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సత్యదేవ్ మాట్లాడారు. ఈ కార్యక్రమానికి అతిథిగా విచ్చేసిన మంచు మనోజ్ చిత్ర యూనిట్‌కి శుభాకాంక్షలు అందించారు. దర్శకుడు ఈశ్వర్ అంకితభావంతో చేసిన సినిమా ఇదని, ఆడియన్స్ మంచి సినిమా చూడబోతున్నారని నటుడు డాలీ ధనుంజయ చెప్పారు. మంచి కంటెంట్‌తో తెరకెక్కుతున్న సినిమా ఇదని దర్శకుడు తెలిపారు. ఇంకా సత్యరాజ్, హీరోయిన్ జెన్నిఫర్ పిసినాటో, నిర్మాతలు కూడా మాట్లాడారు.

ఆత్మహత్య పరిష్కారం కాదని చెప్పే కథ

'చిన్నప్పట్నుంచీ సాహిత్యాభిమానిని. చదవడం, రాయడం ఇష్టం. దర్శకుడు కావడం నా కల. కొన్ని సినిమాలకు ఘోస్ట్ రైటర్‌గా చేశా. ఆ తర్వాత 'భాగమతి' దర్శకుడు అశోక్ దగ్గర, 'సప్తగిరి ఎక్స్‌ప్రెస్' దర్శకుడు అరుణ్ పవార్ దగ్గర పనిచేశా. లాక్‌డౌన్ టైమ్‌లో ఖాళీ దొరికింది. 'కలి' స్క్రిప్ట్ రాశా. హీరో ప్రిన్స్‌కి వినిపిస్తే బావుంది చేద్దాం అన్నారు. నిర్మాత గౌతమ్‌వర్మ ప్రొడ్యూస్ చేసేందుకు ముందుకొచ్చారు. అలా 'కలి' మొదలైంది.' అంటూ చెప్పుకొచ్చారు దర్శకుడు శివ శేషు. ఆయన దర్శకత్వంలో రూపొందిన సైకలాజికల్ థ్రిల్లర్ 'కలి'. ప్రిన్స్, నరేష్ ఆగస్త్య హీరోలు. రుద్ర క్రియేషన్స్ పతాకంపై లీలా గౌతమ్‌వర్మ ఈ చిత్రాన్ని నిర్మించారు. అక్టోబర్ 4న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా సోమవారం హైదరాబాద్‌లో విలేకరులతో ముచ్చటించారు దర్శకుడు శివ శేషు. 'ఈ సినిమా ప్రీప్రొడక్షన్‌కి ఏడాదిన్నర కేటాయించాం. ఇది ఒకే లొకేషన్‌లో జరిగే కథ కావడంతో ఫిల్మ్‌సిటీలో సెట్ వేశాం. ఈ సినిమాకు పనిచేసినవారంతా యంగ్ బ్యాచ్. జీవితంలో ఎదురయ్యే సమస్యలకు ఆత్మహత్యలు పరిష్కారం కాదని చెప్పే కథ ఇది. ఇందులో ప్రిన్స్ శివరామ్ అనే కేరక్టర్ చేశాడు. మంచివాడు, మృదుస్వభావి అయిన శివరామ్ సమస్యల్ని భరించలేక ఆత్మహత్య చేసుకోవాలనుకుంటాడు. ఇంతలో అతని ఇంటికి ఓ అపరిచిత వ్యక్తి వస్తాడు. ఆ కేరక్టరే నరేష్ ఆగస్త్య చేశాడు. అతనొచ్చాక శివరామ్ జీవితంలో ఎలాంటి మార్పులు చోటుచేసుకున్నాయ్? అనేదే ఈ సినిమా కథ. ఇది రెండు పాత్రల మధ్య నడిచే స్క్రిప్ట్. ఇద్దరూ అద్భుతంగా నటించారు. పురాణాల్లో కలి పురుషుడి పాత్రను ప్రేరణగా తీసుకొని రాసుకున్న కథ ఇది' అని తెలిపారు శివ శేషు.